క్లుప్తంగా

ఘనంగా ఎంపీడీఓకు వీడ్కోలు



ఎంపీడీఓకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే

నాగలాపురం: వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు విరమణ తప్పదని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవోకు శాలువ కప్పి, గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 39 ఏళ్ల కిందటే ఇదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించి నేడు ఇక్కడే ఎంపీడీఓగా విరమణ పొందడం ఆయన అదృష్టం అన్నారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ట్యాంకులు పరిశుభ్రం చేయిస్తున్న శివయ్య

ఏర్పేడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. మండల కేంద్రంలోని మూడు ఓవర్ హెడ్ ట్యాంకులను ఆదివారం శుభ్రం చేసినట్టు చెప్పారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రతతో డయేరియా, విష జ్వరాలు, మలేరియాలాంటి వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో లోరా, కృష్ణవేణి, లత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని బస్సు పాసులు

ఏర్పేడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు ఉచిత బస్సు పాసులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఏర్పేడు, బండారుపల్లి, పల్లం, పాపానాయుడుపేట, కందాడు, మునగలపాళెం, పంగూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలలకు చుట్టుపక్కల సుమారు 5 కిలోమీటర్ల దూరంలోని గ్రామాల నుంచి విద్యార్థులు వెళుతుంటారు. ప్రభుత్వం బాలికలకు 1 నుంచి 10 తరగతి వరకు, బాలురకు 1 నుంచి 7వ తరగతి వరకు ఉచితంగా బస్సు పాస్‌లు అందజేయాల్సి ఉంది. ఎండాకాలం సెలవుల అనంతరం ఈ నెల 13న ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ చేయలేదు. ఆటోలు, బస్సులకు చార్జీలు చెల్లించి పాఠశాలలకు పంపించడం కష్టతరంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.


వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ కార్యాలయంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం మండలంతో పాటు పలువురు వైద్యాధికారులను సంస్థ సభ్యులు సన్మానించారు. సంస్థ అధ్యక్షులు హేమకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్యం చేస్తున్న వైద్యులను సన్మానించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. సన్మానం పొందిన వైద్యుల్లో శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహుల్‌రాజ్, గజేంద్రనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవంతి, భాస్కరపేట పీహెచ్‌సీ వైద్యాధికారి రూపేష్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముఖేష్, పూజ, నారాయణ, శ్రీనివాసులు, చంద్రకాంత్, కాంగ్రెస్, ప్రదీప్‌కుమార్, మోక్షిత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం



రంగయ్యను సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని శ్రీకాళహస్తి ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(స్కెప్సా) అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మొదటి సాధారణ సమావేశంలో స్కెప్సా సభ్యులు ప్రభుత్వ ఉద్యోగిగా విరమణ పొందిన భవాని స్కూల్ కరస్పాండెంట్ చిలకా రంగయ్యను ఘనంగా సన్మానించారు. కాయం సుబ్బరామిరెడ్డి, ఢిల్లీబాబు, చంద్రశేఖర్, విద్యాసాగార్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల నిలువు దోపిడీ

- నిబంధనలు పాటించని పలు యాజమాన్యాలు
- ఇష్టారాజ్యంగా ఫీజుల పెంపు
- అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయం



ప్రైవేటు స్కూల్ తరగతి గదులను పరిశీలిస్తున్న ఎంఈఓ (ఫైల్)

వరదయ్యపాళెం: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం వంటి కనీస వసతులు కల్పించడం లేదు. విద్యార్థుల నుంచి ఫీజులను ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీని అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవల్సిన విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది సత్యవేడు నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలల పరిస్థితి. సత్యవేడు నియోజకవర్గంలో మొత్తం 26 ప్రైవేటు పాఠశాలలు, మరో 18 ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వివిధ మండలాల్లో ఉన్న ఈ పాఠశాలలు ఏళ్లతరబడి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఈ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ఎక్కడా అమలుకావడం లేదు. 1994 నుంచి అమల్లో ఉన్న ఈ చట్టాన్ని అమలు చేయడంలో విద్యాశాఖాధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

కనీస సౌకర్యాలు కరువు

నియోజకవర్గంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లలో చూపుతున్న శ్రద్ధను యాజమాన్యాలు మౌళిక వసతుల కల్పనలో చూపడం లేదు. సగానికిపైగా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడం ప్రైవేటు యాజమాన్యాల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరుగుదొడ్ల పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదు. దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. వాస్తవానికి పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సర్టిఫికెట్ ఇవ్వాలి. అయితే వైద్యుల చేయి తడిపి సర్టిఫికెట్లు పొందిన కారణంగా పాఠశాలల్లో సౌకర్యాలు ఇలా తయారయ్యాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

నాన్ క్వాలిఫైడ్ టీచర్లతో బోధన

నియోజకవర్గంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లు లేరు. పాఠశాలల గుర్తింపు సమయంలో యాజమాన్యాలు బీఈడీ, పండిట్ ట్రెనింగ్ పొందిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసి గుర్తింపు పొందుతారు. ఆ తర్వాత ట్రెనింగ్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని ఇంటర్, డిగ్రీ చదివిన వారితో బోధన చేయిస్తున్నారు. క్వాలిఫైడ్ టీచర్లు లేకుండా పాఠశాలలను నడుపుతున్నారు.

ఫైర్ సేఫ్టీ గాలికి..

పాఠశాలల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను గాలికి వదిలేశాయి. కొన్ని పాఠశాలలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నా దాదాపు 20కిపైగా పాఠశాలలు, కళాశాలలు పాటించడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే విద్యార్థులు బయటకు వెళ్లేందుకు భవనాల్లో రెండు మార్గాలు ఉండాలి. అయితే ఎక్కడా రెండు మార్గాలు కనబడడం లేదు. అగ్ని ప్రమాదాలను నివారించే పరికరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

క్రీడా ప్రాంగణాలు లేకుండానే..

ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు ఉండడం లేదు. ప్రైవేటు యాజమాన్యాలు పాఠశాలలకు అనుమతి పొందే సమయంలో రెండు, మూడు గదులను ఇండోర్ ఆటస్థలాలుగా చూపిస్తున్నాయి. పాఠశాలలకు దూరంగా ఉన్న ఖాళీ స్థలాలను చూపి విద్యాశాఖాధికారులకు తాయిలాలు ఇచ్చి అనుమతి పొందుతున్నాయి. నియోజకవర్గంలో దాదాపు సగానికి పైగా పాఠశాలలకు క్రీడా ప్రాంగణాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

అడ్డూ అదుపూ లేని ఫీజులు

ఫీజులకు సంబంధించి పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక ఖాతాలు తెరవాలి. ప్రతి ఏటా ఆడిట్ నిర్వహించాలి. 1994లో వచ్చిన జీఓ ప్రకారం 5 శాతానికి మించి లాభం తీసుకోరాదు. అయితే ప్రస్తుతం ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు రూ.20వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి 2010లో జీఓ నెంబరు 42(2) తెచ్చారు. అయితే ఎక్కడా ఈ జీఓను అమలు చేయడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రైవేటు పాఠశాలలపై ఎంఈఓల పర్యవేక్షణ శూన్యంగా మారింది. ప్రభుత్వ అనుమతికి ప్రాథమిక స్థాయి నుంచి పూర్తిస్థాయిలో పరిశీలన జరిపే అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదు. విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు ఫిర్యాదులు చేస్తున్నా తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఫిర్యాదులపై ఆయా పాఠశాలల యాజమాన్యాలకు సమాచారం ఇస్తున్నారు. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారి ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణ జరపాలి



ప్రైవేటు పాఠశాలలపై విజిలెన్స్ విచారణ జరపాలి. పాఠశాలల్లో కనీస వసతుల కల్పన, ఫీజులు, పుస్తకాల అమ్మకాలు తదితరాలపై తనిఖీలు జరగాలి. నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి.

– తరుణ్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకుడు

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు వివరాలను తమకు పంపాలని సూచించాం. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందే. లేని పక్షంలో చర్యలు తప్పవు. మండలంలోని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేస్తాం. అవసరమైన చర్యలు తీసుకుంటాం

– సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

శ్రీపోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు



పూలంకరణలో శ్రీపోలేరమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో గ్రామదేవత శ్రీపోలేరమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు సమర్పించారు. శ్రీ పోలేరమ్మ దేవతకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, హోమాలు చేశారు. భక్తిశ్రద్ధలతో గ్రామస్తులంతా ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



పోలేరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఏఓ అనసూయ సేవలు అభినందనీయం



అనసూయ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

వరదయ్యపాళెం: మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అనసూయ సేవలు అభినందనీయమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. అనసూయ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పలువురు అధికారులు ఆమెను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ భారతి, బీఎన్‌కండ్రిగ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విక్రమ్, వరదయ్యపాళెం పంచాయతీ ఈఓ బసిరెడ్డి, ఎంఈఓ సరస్వతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డయేరియాపై హెల్ప్‌లైన్ ఏర్పాటు

తిరుపతి తుడా: తాగునీటి కాలుష్యం వలన కలిగే డయేరియా వ్యాధిపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అలాగే డెంగీ, మలేరియా సమస్యలపై ఫిర్యాదు, సహాయం నిమిత్తం హెల్ప్ లైన్ నంబర్ 0877–2256766ను ప్రారంభించినట్లు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ప్రజలు డయేరియా సంబంధిత ఫిర్యాదులను 24 గంటల పాటు పని చేసే హెల్ప్‌లైన్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ట్రాఫిక్‌తో జనానికి ఇక్కట్లు



మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌తో ఆగిన వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించు కోకపోవటంతో ట్రాఫిక్‌తో వాహనాలు నిలిచిపోతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఆటోలు పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకొని వాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎస్వీ నాగేశ్వరరావుకు ఘన వీడ్కోలు



ఎస్వీ నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా విధులు నిర్వహించి ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్వీ నాగేశ్వరరావును పలువురు ఘనంగా సన్మానించారు. ప్రస్తుత ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం స్వామి అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత రేణిగుంట



విజేతగా నిలిచిన రేణిగుంట జట్టు

నాయుడుపేట టౌన్: ఏఎల్‌సీఎం మైదానంలో ఆదివారం రాత్రి వరకు జరిగిన అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీలో రేణిగుంట, నాయుడుపేట జట్లు విజేతలుగా నిలిచాయి. 10 జట్లకు పైగా పోటీల్లో తలపడ్డాయి. ఫైనల్స్‌కు రేణిగుంట, నాయుడు పేట జట్లు హోరాహోరీగా తలపడి విన్నర్స్‌గా రేణిగుంట జట్టు, రన్నర్స్‌గా నాయుడుపేట జట్టు నిలిచాయి. మూడో స్థానంలో నెల్లూరు జట్టు నిలిచినట్టు నిర్వాహకులు వెల్లడించారు. జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదవరం నాగూరయ్య, నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు కాళహస్తి భవాన్ అనుదీప్, రాకీ, ప్రవీణ్, సిరాగ్, ఏలిష, నాని, ముని తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణనిచ్చిన మన్‌కీ బాత్



మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఎంతో ప్రేరణ కలిగించిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని తిలకించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా ఆయన మూడవ సారి బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి మన్‌కీ బాత్ నిర్వహించారన్నారు. ఇందులో చాలా మంచి అంశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేశాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ, గరికపాటి రమేష్, డిల్లీబాబు, వాసుయాదవ్, అమరనాథ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ హెల్త్ విభాగం కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

తిరుపతి సిటీ: టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను యధావిధిగా కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి సుబ్రమణ్యం, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడారు. టీటీడీ హెల్త్ విభాగం ద్వారా విద్యా సంస్థలలో, తిరుచానూరు, గోవిందరాజస్వామి టెంపుల్, ఏడీ బిల్డింగ్ తదితర ప్రాంతాలల్లో దాదాపు 20 ఏళ్ల నుంచి సుమారు 570మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో 250మంది కార్మికులను తొలగించాలని టీటీడీ హెల్త్ టెండర్‌లో నిబంధనలు పెట్టడం దారుణమన్నారు. టీటీడీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికుల కడుపుకొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఏ ఒక్క కార్మికుడినైనా విధుల నుంచి తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు పి బుజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్, మేఘాలయ చీఫ్ జస్టిస్ వైద్యనాథన్ వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రభుత్వ ఆస్పత్రులలో సరిపడా నిల్వలు
- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు



వరదయ్యపాళెం మండలం పెద్ద పాండూరులో టీకాలు వేసేందుకు సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



టీకాలు వేసేందుకు గర్భిణుల వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకూ ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీని వల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లు వేసేది ఇలా..

గర్భిణిగా నిర్ధారణ అయిన 3 నెలలు నిండిన తర్వాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెల రోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, క్యాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు. తొమ్మిది నెలల నుంచి 12నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయించాలి.

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఉదయ్‌కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ